క్లుప్తంగా

విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి



అమలాపురంలో సమావేశమైన జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం పెద్దలు

అమలాపురం టౌన్: విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ స్థానిక విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో సంఘం జిల్లా పెద్దలు ఆదివారం సాయంత్రం సమావేశమై చర్చించారు. కోనసీమ నుంచి విశ్వ బ్రాహ్మణులకు ఓ ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి జగన్ వెంటే తమ విశ్వ బ్రాహ్మణుల అభ్యర్థనను పరిశీలించాలని కోరారు. జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం పెద్దలు దార్ల పాపయ్యాచారి, కట్టోజు సన్నయ్యదాసు, ఆవుపాటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోగి కుటుంబానికి సాయం



అంబేద్కర్‌నగర్‌లో వృద్ధురాలు మేరీబాయ్‌కు నిత్యావసరాలు అందజేసిన దృశ్యం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలిక వ్యాధులు, వృద్ధాప్యం తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రతివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నగదు, నిత్యావసరాల కిట్‌లను పంపిణీ చేస్తున్నారు. బీహార్ నుంచి వచ్చి స్థానిక అంబేద్కర్‌నగర్‌లో నివాసముంటూ అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు సుంకర మేరీబాయ్‌కు బియ్యం, నిత్యావసర కిట్టు, నగదు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుగ్గదుర్తి అనిత, రెయ్యా ప్రసన్నకుమార్, నెల్లి అనిత, గంటా మనోజ్, నీరుపూడి సునీత, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.


నడకతోనే ఆరోగ్య పరిరక్షణ



వాకర్స్ ఆరోగ్య సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శశి కిరణ్

అమలాపురం టౌన్: ప్రస్తుత స్పీడు యుగంలో ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు నడకను అలవరుచుకోవాలని జీర్ణ కోశ, కాలేయ వైద్య నిపుణుడు డాక్టర్ శశికిరణ్ సూచించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జరిగిన ఆరోగ్య సదస్సులో డాక్టర్ శశి కిరణ్ మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ ఆరోగ్య సదస్సులో క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌కు బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డు



బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డు అందుకుంటున్న తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్‌క్లబ్‌కు బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డు లభించింది. ఆదివారం కాకినాడలోని వైఎంవీఏ హాలులో జరిగిన డిస్ట్రిక్ట్ కాన్‌క్లేవ్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఈ అవార్డును తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డికి క్లబ్ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు అందజేశారు. అభాగ్యుల కడుపు నింపేందుకు లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పన్ ఉచిత భోజన పథకాన్ని ప్రారంభించి, పేదల ఇంటి వద్దకే భోజనాన్ని అందిస్తున్నందుకు గాను తాళ్లరేవు లయన్స్‌క్లబ్ సభ్యులను మంగతాయారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బాదం బాలకృష్ణ, కాశే వీర్రాజు, నున్న దత్తు, సతీష్‌రాజు, చోడే మాలతీవసుంధర తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

ఉప్పలగుప్తం: మండలంలోని ఇటీవల కూనవరంలో విద్యుద్ఘాతంతో మరణించిన కొప్పిశెట్టి రామస్వామి కుటుంబానికి రూ.20 వేలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గోపవరం గ్రామానికి చెందిన నాగాబత్తుల ప్రసాద్‌కు రూ.15 వేలను ఆదివారం జనసేన నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఉండ్రు భగవాన్‌దాస్, బసవా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు ఘనం.. నిర్వహణ కనం..

- యానాంలో రూ.2 కోట్లతో నిర్మించిన మ్యూజికల్ ఫౌంటైన్
- గాలికొదిలేయడంతో అలంకార ప్రాయంగా మారిన వైనం
- నిరాశగా వెనుదిరుగుతున్న పర్యాటకులు



అలంకారప్రాయంగా మిగిలిపోయిన మ్యూజికల్ ఫౌంటైన్



నిరుపయోగంగా ఉన్న గార్డెన్‌లోని షాపులు

యానాం: పర్యాటక ప్రాజెక్టుల పేరిట కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణాలు చేశారు. నిర్వహణను గాలికొదిలేయడంతో అవన్నీ అలంకార ప్రాయంగా మారిపోయాయి. వాటిని చూసేందుకు వస్తునపర్యాటకులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇదీ యానాం పట్టణంలోని బొటానికల్ గార్డెన్‌లో రూ.2 కోట్ల ఖర్చుతో నిర్మించిన మ్యూజికల్ ఫౌంటైన్, లేజర్‌షో దుస్థితి..

2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీసుకున్న 55 ఎకరాల్లో ఉన్న మంచినీటి చెరువుకు చేర్చి ఉన్న స్థలంలో రూ.8 కోట్ల ఖర్చుతో బొటానికల్ గార్డెన్‌ను నిర్మించారు. ఈ బొటానికల్ గార్డెన్ సైన్స్ విద్యార్థులకు ఉపకరిస్తుందని భావించినా కేవలం ఒక భవంతిని నిర్మించి వదిలివేశారు. అంతే కాదు బొటానికల్ గార్డెన్‌లో ఉండాల్సిన మొక్కలు అక్కడ ఏర్పాటు చేయలేదు. 2016లో దీన్ని ప్రస్తుత సీఎం రంగసామి ప్రారంభించారు. అనంతరం మళ్లీ అదే స్థలంలో రూ.2 కోట్ల నిధులతో మ్యూజికల్ ఫౌంటైన్, లేజర్ షోలను ఏర్పాటుచేశారు. జనవరి 2019లో సౌండ్ అండ్ లైట్ షో పేరిట 2019లో అప్పటి సీఎం నారాయణసామి ప్రారంభించారు. కేవలం కొంతకాలమే పనిచేసింది. తరువాత నిర్వహణ గాలికొదిలేయడంతో అది కాస్త మూలకు చేరింది.

అధికార యంత్రాంగం నిర్లక్ష్యం

కోట్లాది రూపాయల ఖర్చుతో బొటానికల్ గార్డెన్‌లో నిర్మించిన మ్యూజికల్ ఫౌంటైన్‌కు సంబంధించిన యంత్రాలను, మోటార్లను పీడబ్ల్యూడీ అధికారులు నిర్వహణ చేయాల్సి ఉంది. అయితే యంత్రాలు మూలకు చేరినా వాటి వంక కన్నెత్తి చూసే నాథుడు లేకుండా పోయాడు.

బొటానికల్ గార్డెన్ పచ్చదనం కరవై కళావిహీనంగా మారడమే కాదు అక్కడ పర్యాటకులకు కావాల్సిన కనీస సౌకర్యాలు సైతం ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. ఏటా సంక్రాంతి మూడు రోజులూ మ్యూజికల్ ఫౌంటైన్, లేజర్‌షో ప్రదర్శిస్తుంటారు. ఈ ఏడాది మాత్రం ప్రదర్శనల ఊసే లేకుండా పోయింది.

వినియోగంలోకి తేవాలి



పర్యాటక శాఖ ద్వారా కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన బొటానికల్ గార్డెన్, మ్యూజికల్ ఫౌంటైన్ గాలికొదిలేయడం వల్ల శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై అధికారులు దృష్టి సారించాలి.

– నబ్బుతి శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త, యానాం

వివాదం.. సామరస్యంగా పరిష్కారం



ఇరు పక్షాలతో చర్చలు జరుపుతున్న డీఎస్పీ మాధవరెడ్డి, సీఐ కొండలరావు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి అమ్మవారి జన్మదిన వార్షిక మహోత్సవాలు జరుగుతున్న సమయంలో ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన యాగశాల మధ్య నుంచి వేరే మతానికి చెందిన ఓ శవయాత్ర సాగడంతో భక్తులు, వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. ఇరు పక్షాలకు చెందిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. డీఎస్పీ వై.మాధవరెడ్డి, పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావులు ఇరు పక్షాలతో ఆదివారం రాత్రి నిర్వహించిన చర్చలు సామరస్య పూర్వకంగా పరిష్కారమయ్యాయి. అమ్మవారి ఆలయంలో ప్రతీ దసరాకు నిర్వహించే ఉత్సవాల సందర్భంలో 15 రోజులు, అమ్మ వారి జన్మదిన వార్షిక ఉత్సవాల్లో 15 రోజులు ఈ రెండు సందర్భాల్లో శవాలు ఆలయం ఎదుట నుంచి తీసుకెళ్లకూడదన్న నిర్ణయానికి ఇరు పక్షాలు అంగీకరించినట్లు సీఐ కొండలరావు తెలిపారు. తొలుత ఈ ఘటనపై శ్రీదేవి ఉత్సవ కమిటీ ప్రతినిధులు, మార్కెట్ వ్యాపారులు, భక్తులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల ఎదుట మరో వర్గం నాయకులు సైతం తమ వాదనను వినిపించారు. డీఎస్పీ, సీఐ నిర్వహించిన ఈ చర్చల్లో ఇరు పక్షాలకు చెందిన కల్వకొలను తాతాజీ, గంగాబత్తుల రాంబాబు, ఎండీ ఆజామ్, ఎండీ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి ఆక్వా చెరువుల వ్యర్థాలు



సవరప్పాలెంలో పంట కాలువలోకి ఆక్వా వ్యర్థాల్ని మళ్లించిన దృశ్యం

అమలాపురం రూరల్: పలు మండలాల శివారు ప్రజలకు తాగునీరందించే పంట కాలువలు కాలుష్యానికి గురవుతున్నాయి. ఆక్వా వ్యర్థాలను యథేచ్ఛగా పంట కాలువల్లోకి వదిలేస్తున్నా జల వనరుల శాఖ, పంచాయతీ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో మురుగునీరు తాగాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అమలాపురం-చల్లపల్ల ప్రధాన పంట కాలువలోకి కిత్తనచెరువు, సవరప్పాలెం సమీపంలో ఆక్వా చెరువుల వ్యర్థాలను మోటార్లతో పంట కాలువలోకి తోడేస్తున్నారు. అదే కాలువ నీళ్లను ఉప్పలగుప్తం, అమలాపురం మండలంలోని కూనవరం, చల్లపల్లి, చిందాడగరువు, వన్నెచింతలపూడి పంచాయతీ ప్రాంతాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు సరఫరా చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ మాధవరెడ్డి

అమలాపురం రూరల్: భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో కోనసీమ జోన్ భాష్యం విద్యాసంస్థల అంతర్గత జోనల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారంతో ముగిసింది. పాఠశాలల హెడ్ జేవీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు డీఎస్పీ వై.మాధవరెడ్డి, రూరల్ సీఐ వీరబాబులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కోనసీమలోని భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జార్జిపేటలో రామాలయానికి శంకుస్థాపన



నూతన రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు: జార్జిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిపేటలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, నాగమణి దంపతులు రామాలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ, లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. గ్రామస్తుల విరాళాలు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ల ఆర్థిక సహకారంతో రామాలయాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ రెడ్డి నాగు, సర్పంచ్ పేర్ని ఆదినారాయణ, నాయకులు పెంకే ఏడుకొండలు, గుత్తుల గోవిందు, గుత్తుల నూకరాజు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



కోరంగి అభయారణ్యంలోని రిసార్ట్‌లో కలుసుకున్న 1985-86 బ్యాచ్ విద్యార్థులు

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ప్రముఖ పర్యాటక ప్రదేశమైన కోరంగి అభయారణ్యంలోని రిసార్ట్‌లో సుమారు 38 ఏళ్ల అనంతరం కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. రానున్న మార్చి 12వ తేదీన తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కుటుంబ సమేతంగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో రోళ్ల శ్రీనివాస చక్రవర్తి, ఐతంపూడి శ్రీను, రాంబాబు, రాంజీ, మంగామణి, సామా సుజాత, అద్దేపల్లి కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మ తీర్థ మహోత్సవాలు



సత్తెమ్మ తల్లి అమ్మవారు



కిక్కిరిసిన క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ముమ్మిడివరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మ దర్శనానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామ ప్రముఖులు మేకల వంశీయులు అమ్మవారికి స్వయం పాకాలు సమర్పించి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని సన్నాయిమేళాలు, బాజా భజంత్రీలు, శక్తి వేషధారణలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో అత్యంత ఘనంగా ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు అలరించాయి. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. తీర్థ మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం.జానకీరామ్ ఆధ్వర్యంలో ఎస్ఐ కె.సురేష్ కుమార్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

అల్లవరం: మండలంలోని ఓడలరేవు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ తీర్థాన్ని ఏర్పాటుచేశారు.

యూనియన్‌కు నూతన కార్యవర్గం ఎంపిక



ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ అమలాపురం శాఖ ఆదివారం ఉదయం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శిరీష్‌కుమార్, కార్యదర్శి బలరామ్ తదితరులు పాల్గొని ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎస్ఎస్‌వీఎల్ పోలేశ్వరరావు, పి.రమేష్, కార్యదర్శిగా జి.వీర ఆంజనేయ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా పి.దుర్గా బాపిరాజు, పి.ప్రసాద్, కోశాధికారిగా ఏవీ సంతోష్‌లు ఎన్నికయ్యారు.

నేటితో ముగియనున్న కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు



కుష్ఠువ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

అలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో గత పక్షం రోజుల నుంచి కొనసాగుతున్న కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు సోమవారం ముగియనున్నాయి. కాకినాడకు చెందిన కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రత్యేక అధికారి సంజీవ్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి కుష్ఠు వ్యాధి నివారణ-తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామ సచివాలయాల పరిధిలోని ముఖ్య కూడళ్లలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచారు. మండలంలో రెండు పీహెచ్‌సీల పరిధిలో గతంలో నమోదై ఉన్న 93 కేసుల్లో ఇప్పటి వరకూ రోగులు కోలుకున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో కుష్ఠు వ్యాధి రహిత సమాజానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సూపర్‌వైజర్లు రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు బాసటగా నిలవాలి



చిన్నారులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న వంటెద్దు వెంకన్నాయుడు

ఉప్పలగుప్తం: సమాజంలో హెచ్‌ఐవీ వ్యాధి సోకిన వారికి సహాయ సహకారాలు అందిస్తే వారు మానసికంగా మరింత ఆరోగ్యంగా ఉంటారని జిల్లా దివ్యాంగుల సంఘ గౌరవ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అన్నారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వంటెద్దు వెంకన్నాయుడు, జల్లి సుజాత, కె.ధీరజ్, ప్రసన్న, రిష్విక్, జి.చంద్రశేఖర్ సమకూర్చిన పౌష్టికాహార కిట్లను మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో 45 మంది హెచ్‌ఐవీ బాధితులకు ఆదివారం అందించారు. అనంతరం సమాజంలో సేవా దృక్పథంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న వంటెద్దు వెంకన్నాయుడు, జల్లి సుజాతలను స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట సమీపంలోని గోదావరి ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి పురుగు మందు తాగాగి ఈ నెల 10న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడు స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందూ మృతి చెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. ఎస్ఐ నూకరాజు చెప్పిన వివరాల ప్రకారం మృతుడికి 55–60 ఏళ్ల వయసుంటుంది. అతడి మృతదేహాన్ని యానాం జీజీహెచ్ మార్చురీలో ఉంచినట్లుగా తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సీఐ ఆఫీస్ 0884–2321210, పోలీస్‌స్టేషన్ 0884–2321233 నెంబర్లకు తెలపాలన్నారు.

రూ.1.67 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వెల్లడి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో రూ.1.67 కోట్ల సీఎస్ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.7 లక్షలతో వెంకటనగర్‌లో రీడింగ్ రూం, రూ.9.89 లక్షలతో కురసాంపేట నాలుగో మెయిన్ రోడ్డు నుంచి డ్రైన్, రూ.9.20 లక్షలతో నూకాలమ్మ గుడి జంక్షన్ నుంచి దరియాలతిప్ప న్యూకాలనీ వరకూ డ్రైన్, రూ.10 లక్షలతో కనకాలపేట ఫిషర్‌మెన్ పేట క్రాస్‌రోడ్డు నిర్మించనున్నట్లుగా చెప్పారు. రూ.18 లక్షలతో గిరియాంపేట శ్మశాన వాటిక నుంచి వంతెన వరకూ డ్రైన్ నిర్మాణం, రూ.11 లక్షలతో గిరియాంపేటలో కమ్యూనిటీ హాలు ఆధునికీకరణ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆ ఆరోపణలు అవాస్తవం

గురుకులం ప్రిన్సిపాల్ సాయిబాబు

అల్లవరం: గోడి బాలుర గురుకులంలో సరైన మౌలిక సౌకర్యాలు కల్పించపోవడం వల్లే ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి మోర్త సోహిత్ రాజ్‌వర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని కొన్ని పత్రికలు ప్రచురించిన కథనాలు, విద్యార్థి సంఘాలు చేసిన ఆరోపణలు అవాస్తవమని గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.సాయిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 25న రాజ్‌వర్ధన్‌కు జ్వరం రావడంతో వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. రాజ్‌వర్ధన్ ఇంటికి వెళ్లాక ఈ నెల 3న విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై హౌస్ ఉపాధ్యాయుడు ఫోన్ ద్వారా వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారన్నారు. తమ కుమారుడు ఇంట్లో ఉరేసుకుని మరణించాడని రాజ్‌వర్ధన్ తండ్రి ఈ నెల 5వ తేదీన గురుకుల పాఠశాలకు సమాచారం ఇచ్చారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థి తన ఇంట్లో ఆత్మహత్య చేసుకుంటే మౌలిక సౌకర్యాలు లేకపోవడం వల్లే అని కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని చెప్పారు.

గురుకుల పాఠశాలలో మంత్రి తనయుడి పరిశీలన



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

అల్లవరం: గోడి గురుకుల పాఠశాలలో కాట్రేనుకోన గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి రాజవర్ధన్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, ఎంపీపీ ఇళ్ల శేషారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీలు ఆదివారం గోడి బాలుర గురుకుల పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు ఎలాంటి మౌలిక సదుపాయాలున్నాయో పరిశీలించారు. తాగునీరు, భోజన వసతి బాగుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు భోజనం బాగుంటుందని బదులిచ్చారు. మరుగుదొడ్లు, గదుల్లో ఫ్యాన్లను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో పరిశీలించిన విషయాలను మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

తాళ్లరేవు: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనం వద్ద మహాసభల పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నాలుగు రోజుల పాటు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత్తా నగరంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో దుప్పి అదృష్ట దీపుడు, తణుకురాజు, గోడి భాస్కరరావు, ఎన్.త్రిమూర్తులు, చొల్లంగి వెంకటలక్ష్మి, వల్లు రాజబాబు పాల్గొన్నారు.

మసీదు అధ్యక్షుడు మక్బూల్ బాషా మృతి



అమలాపురం టౌన్: మున్సిపల్ కౌన్సిల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు, స్థానిక మొల్లా ముస్తాఫా మసీదు అధ్యక్షుడు షేక్ మక్బూల్ బాషా(75) శనివారం రాత్రి తన స్వగృహంలో గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాషా మృతిపై పట్టణంలోని ముస్లిం పెద్దలు సంతాపం తెలిపారు. న్యాయవాది ఎండీ ఆజామ్, సహకార శాఖ విశ్రాంత అధికారి ఎండీ అమీర్ తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.

లక్ష్మణేశ్వరంలో ప్రత్యేక పూజలు

అల్లవరం: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న ఉమా లక్ష్మణేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామి వార్ల ఆలయంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖద్వారం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆంధ్ర ఆటోవాలా మహాసభ జయప్రదం చేయండి

అమలాపురం రూరల్: ఈ నెల 28న ఆంధ్ర ఆటోవాలా పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఆటో యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం శెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. పట్టణ, డెల్టా మహాసభలు నిర్వహించాలని తీర్మానించారు. ఏఐటీయూసీ నాయకుడు కె.సత్తిబాబు ఆధ్వర్యంలో 13 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. వాసం శెట్టి శ్రీనివాసరావు, కామిరెడ్డి చందరావు, మోకా శ్రీనివాసరావు, మట్టపర్తి నారాయణ, బొక్కా నాని తదితరులు పాల్గొన్నారు.